నిర్లక్ష్యం చేస్తే.. పరిహాసమే



అలస్యంగా వర్షం కురవడంతో జే వెంకటంపల్లి వద్ద వేరుశనగ దుస్థితి

- దగ్గర పడుతున్న ఈ–క్రాప్ నమోదు గడువు
- 50 శాతం దాటని ఆన్‌లైన్ ప్రక్రియ
- అన్నదాతలకు అవగాహన అవసరం

రాయదుర్గం: అతివృష్టి , అనావృష్టి , నకిలీ విత్తనాలు, గిట్టుబాటు ధర .. ఇలా అనేక సమస్యలతో రైతులు నిత్యం సతమతమవుతున్నారు. పండించిన పంటకు మద్దతు ధర దక్కలేదు. ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే పెట్టుబడి సైతం చేతికి దక్కదు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో రైతుకు అండగా నిలిచేందుకు వ్యవసాయశాఖ సమాయత్తమైంది. ఈ–పంట నమోదుతో ఆదుకునే చర్యలు చేపట్టింది. ఖరీఫ్‌లో సాగైన పంటల వివరాలన్నీ యూనిఫైడ్ డిజిటల్ ప్లాట్‌ఫాం (యుడీపీ)లో నమోదు చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఈ గొప్ప అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకుంటేనే ప్రయోజనం. ఏ మాత్రం నిర్లక్ష్యం వహించినా భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు. ఈ–క్రాప్ పట్ల అన్నదాతలకు అవగాహన అవసరం.

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో అగ్రికల్చర్, హార్టికల్చర్ 4,72,364 ఎకరాలు సాధారణ విస్తీర్ణం కాగా, అందులో 3,29,540 ఎకరాల్లో ఖరీఫ్ పంటలు సాగయ్యాయి. ఇందులో 37,064 ఎకరాల్లో మాత్రమే ఇప్పటిదాక ఈ–క్రాప్ నమోదు ప్రక్రియ పూర్తయింది. కనీసం 50 శాతం కూడా దాటలేదు. మూడు నియోజకవర్గాల్లోని 15 మండలాల్లో కణేకల్లు 52.07 శాతంతో మొదటి వరుసలో నిలిచింది. 34.0తో రాయదుర్గం మండలం వెనుకబడి ఉంది. సెప్టెంబర్ 15తో తుది గడువు ముగియనుంది.



మారెంపల్లి వద్ద పంట నమోదు చేస్తున్న దృశ్యం

ఈ–పంట నమోదుతో కలిగే ప్రయోజనాలు..

వ్యవసాయశాఖ ద్వారా ఏ పథకం పొందాలన్నా ఈ–పంట నమోదే ప్రమాణికం. క్షేత్రస్థాయిలో ఈ– నమోదు ప్రక్రియ చేస్తేనే ఉచిత పంటల బీమా, పెట్టుబడి రాయితీ, ఉత్పత్తుల కొనుగోలు తదితర ప్రయోజనాలు చేకూరుతాయి. లేకుంటే పండించిన పంట విక్రయించటం కష్టమే. రైతులు అప్రమత్తంగా ఉంటూ ఈ–పంటలో వివరాలన్నీ సక్రమంగా నమోదు చేసుకోవాలి.

రాయదుర్గం నియోజకవర్గంలో పంట నమోదు వివరాలిలా..					
మండలం	సాధారణ సాగు	సాగు విస్తీర్ణం	హార్టికల్చర్	సాగు విస్తీర్ణం	శాతం
	ఎకరాల్లో..	ఎకరాల్లో..	సాధారణ సాగు విస్తీర్ణం		
కణేకల్లు	38,540	25,777	3,566	9,22	52.7
బొమ్మనహాళ్	20,549	16,407	4,458	1,105	42.8
డి హీరేహాళ్	29,208	26,494	4,214	1,643	35.16
గుమ్మఘట్ట	31,645	25,278	3,118	1,354	34.2
రాయదుర్గం	39,495	30,312	3,472	1,791	34.0
కంబదూరు	27,355	20,467	8,636	5,475	36.7
కుందుర్పి	26,190	15,441	7,385	4,657	35.0
కళ్యాణదుర్గం	42,915	31,910	12,539	9,982	34.6
బ్రహ్మసముద్రం	31,931	17,396	5,537	4,660	30.9
శెట్టూరు	26,295	11,752	5,779	5,698	44.7
వజ్రకరూరు	47,663	37,796	5,008	1,900	46.5
ఉరవకొండ	30,122	16163	5,839	2,100	44.8
విడపనకల్లు	18,325	15,162	11,153	1,023	37.6
కూడేరు	36,066	24,171	8,920	8,847	37.1
బెళుగుప్ప	26,065	15,014	6,986	6,532	35.1

పండించే ప్రధాన పంటలు ఇవే..

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో వరి, శనగ, వేరుశనగ, కంది, ఆముదం, మొక్కజొన్న, పెసర, పత్తి, మిరప, టమాట, బొప్పాయి, మామిడి, సపోట, దానిమ్మ, అల్ల నేరేడు, కురగాయాలు, ఆకుకూరలు పండిస్తారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే పంట మొత్తం తుడిచిపెట్టుకు పోవాల్సి వస్తోంది. ఇలాంటి విపత్తులు ఎన్నో చూశాం. ఈ పరిస్థితిని గట్టెక్కాలంటే ఈ–పంట నమోదు ఒక్కటే మార్గం. రైతులు అవగాహన పెంచుకోవాలి.

రైతులు ముందుకు వచ్చి సహకరించాలి

ఈ–పంట నమోదు పై రైతులకు విస్తతంగా అవగాహన కల్పిస్తున్నామని రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ ఏడీఏలు లక్ష్మానాయక్, యల్లప్ప, పద్మజ చెప్తున్నారు. ఈ–పంట ప్రాముఖ్యతపై రైతులకు అర్థమయ్యేలా వివరిస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో అన్నదాతలు ముందుకొచ్చి సహకరించాలన్నారు. ఈ–పంట నమోదు కాకపోతే అత్యవసర పరిస్థితుల్లో రైతులు నష్టపోవాల్సి వస్తుందని, గడువులోపు వంద శాతం లక్ష్యం పూర్తిచేసేలా ప్రణాళికలు చేపట్టామని, సోమవారం నుంచి మరింత వేగవంతం చేసేలా సిబ్బందికి ఆదేశాలు జారీ చేశామన్నారు.

క్లుప్తంగా

విద్యార్థులు ఇష్టపడి చదివితేనే ఉజ్వల భవిష్యత్



మాట్లాడుతున్న ఎంఈఓ-2 సాయికృష్ణ

కూడేరు: విద్యార్థులు ఇష్టంతో చదివితేనే అత్యధిక మార్కులు సాధించడానికి అవకాశముంటుందని మండల విద్యాధికారి -2 సాయికృష్ణ అన్నారు. శుక్రవారం ఆయన కూడేరు మండలంలోని ఇప్పేరు ప్రాథమికోన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఉపాధ్యాయుడిగా మారి విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి, సమాధానాలు రాబట్టి వారిలో విద్యా సామర్థ్యాన్ని తెలుసుకున్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత పాటించాలి

బొమ్మనహాళ్: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రతను పాటించి, వ్యాధులకు దూరంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారులు శ్రీలక్ష్మీ, మల్లీశ్వరి సూచించారు. శుక్రవారం మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో డెంగీ, మలేరియా, సీజనల్ వాధులపై అవగాహన ర్యాలీ చేశారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ నాగమణి, ఆరోగ్య కార్యకర్తలు గోవర్ధన, జైనాబీ, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

14న జాతీయ లోక్ అదాలత్



మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ సివిల్ జడ్జి రమ్య

కళ్యాణదుర్గం రూరల్: కళ్యాణదుర్గం కోర్టులో సెప్టెంబర్ 14న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని ఇన్‌చార్జ్ సివిల్ జడ్జి (రాయదుర్గం) రమ్య తెలిపారు. శుక్రవారం కళ్యాణదుర్గంలోని కోర్టులో న్యాయవాదులు, పోలీసులతో సమావేశం నిర్వహించారు. అనంతరం పట్టణంలోని సబ్ జైలును తనిఖీ చేసి, ఖైదీల సౌకర్యాలపై ఆరాతీశారు. కార్యక్రమంలో సీఐ హరినాథ్, బార్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు కరణం తిప్పేస్వామి, బార్ ప్రెసిడెంట్ హరి చక్రవర్తి, సాయి వరప్రసాద్, దాదాఖాలందర్ పాల్గొన్నారు.

సామాజిక బాధ్యతగా మొక్కలు నాటాలి



బీటీపీ లేఅవుట్‌లో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

రాయదుర్గంటౌన్: సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, సంరక్షించాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం పట్టణ శివారు బీటీపీ హౌసింగ్ లేఅవుట్‌లో వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, కమిషనర్ దివాకర్‌రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, ఫారెస్ట్ అధికారులు, టీడీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే మొక్కలు నాటారు. ఫారెస్ట్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం ధ్వంసం



కర్ణాటక మద్యం ధ్వంసం చేస్తున్న సెబ్ అధికారులు

ఉరవకొండ: ఉరవకొండ సెబ్ సీఐ కార్యాలయం పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన కర్ణాటక , గోవా మద్యం అసిస్టెంట్ ఎక్సైజ్ శాఖ ఏఈఎస్ శ్రీరామ్ ఆధ్వర్యంలో శుక్రవారం ధ్వంసం చేశారు. ఏఈఎస్ మాట్లాడుతూ కర్ణాటక టెట్రా ప్యాకెట్లు 52 కేసులు ధ్వంసం చేశామన్నారు. మద్యం విలువ మొత్తం రూ.6 లక్షలు ఉంటుందన్నారు. కార్యక్రమంలో సెబ్ సీఐ కిశోర్, సెబ్ సిబ్బంది పాల్గొన్నారు.

'ఇండి గ్యాప్ పొలంబడి' తో పర్యావరణ హితమైన దిగుబడి

కూడేరు: ఇండిగ్యాప్ పొలంబడి ద్వారా యాజమాన్య పద్ధతులతో పర్యావరణ హితమైన, హానికారక అవశేషాలు లేని ఫలసాయాన్ని (దిగుబడి) పొందొచ్చని రైతులకు ఏఓ విజయ కుమార్ తెలిపారు. రైతులు అధిక దిగుబడులు సాధించేలాన్నదే 'ఇండి గ్యాప్ పొలం బడి' లక్ష్యమని అన్నారు. శుక్రవారం ఉదిరిపికొండలో లక్ష్మీదేవి అనే రైతుకు చెందిన వేరుశనగ పంటలో వ్యవసాయాధికారులు, కార్డు స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఇండి గ్యాప్ పొలం బడి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కార్డు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి నిర్మలా రెడ్డి, వీపీఏ జయప్రకాష్, ఏపీసీఎన్ఎఫ్ ఎంప కుల్లాయప్ప, ఐసీఆర్‌పీ నరసింహులు రైతులు పాల్గొన్నారు.

ఆలయాల్లో చివరి శ్రావణ శుక్రవార సందడి

రాయదుర్గంటౌన్: రాయదుర్గంలోని ప్రముఖ ఆలయాల్లో చివరి శ్రావణ శుక్రవారం భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. పట్టణంలోని హటకేశ్వర స్వామి ఆలయంలో శ్రావణ శుక్రవారం పూజలను ప్రత్యేకంగా నిర్వహించారు. హటకేశ్వరస్వామి ఆలయంలో శ్రీరాజరాజేశ్వరి మహిళా మండలి ఆధ్వర్యంలో వరమహాలక్ష్మీ వ్రత పూజ జరిగింది. పట్టణంలోని నాగులకట్ట వద్ద మహిళలు హాజరై, పూజలు చేశారు. పట్టణంలోని నేసేపేటలో వెలసిన శ్రీవర మహాలక్ష్మీ ఆలయం, కల్లీమఠం హైస్కూల్ వద్ద వెలసిన మహాలక్ష్మీ ఆలయం, మల్లాపురం ఇందిరమ్మ లేఅవుట్ నందు వెలసిన శ్రీగజలక్ష్మీదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. వాసవీ మాత ఆలయంలో, శాంతినగర్‌లోని బన్ని మహంకాళి ఆలయంలో, దుగ్గిలమ్మ ఆలయాల్లో, బసవ నాగలింగేశ్వరస్వామి ఆలయాల్లో శ్రావణ శుక్రవారం పూజలు చేశారు.

భక్తిశ్రద్ధలతో ఆఖరి శ్రావణ వరలక్ష్మి వ్రతం

రాయదుర్గం: శ్రావణమాసం ఆఖరి శుక్రవారం సందర్భంగా పలు ఆలయాల్లో, నివాస గృహాల్లో మహిళలు వరలక్ష్మి వ్రతాలను భక్తి శ్రద్ధలతో ఆచరించారు. డి హీరేహాళ్ మండలం ఓబుళాపురం సమీపాన సరిహద్దు ప్రాంతంలో వెలసిన మహాలక్ష్మి ఆలయంలో పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఒడిబియ్యం పోసి మొక్కులు చెల్లించారు.



కూడేరు: ప్రత్యేక అలకంరణలో లక్ష్మీదేవి

నేమకల్లు అంజన్నకు ప్రత్యేక పూజలు

బొమ్మనహాళ్: ప్రసిద్ధి చెందిన నేమకల్లు ఆంజనేయ స్వామి ఆలయంలో శ్రావణ శుక్రవారం పూజలు చేశారు. స్వామిని ప్రత్యేకంగా పుష్పాలతో అలంకరించారు. పవిత్ర గంగాజలాభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, ప్రత్యేక బంగారు కిరీటధారణ, ప్రత్యేక పుష్పాలకరణ పూజలు చేశారు. బ్రహోత్సవాల సందర్భంగా శ్రీరామ పట్టాభిషేకం నిర్వహించారు.

రామాలయంలో లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు

కూడేరు: శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని కోదండ రామాలయంలో లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకుడు భాస్కర్‌శాస్త్రి లక్ష్మీదేవికి తొలుత క్షీరాభిషేకం చేసి, వివిధ రకాల పట్టు వస్త్రాలు, పుష్పాలతో విశేషంగా అలంకరణ చేశారు. అనంతరం కుంకుమార్చన చేశారు.



హటకేశ్వరస్వామి ఆలయంలో వరలక్ష్మీ పూజ

నేడు 12 వార్షికోత్సవ బ్రహ్మరథోత్సవం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని మొలకాల్మూరు రోడ్డు చెక్ సమీపంలో వెలసిన అభయాంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం విశేష పూజలు చేశారు. గణపతి హోమం, పవమాన హోమం, దీక్షా హోమం నిర్వహించారు. శనివారం ఉదయం 11 గంటలకు మడుగు తేరును జరుగుతుందని, సాయంత్రం 4 గంటలకు స్వామి రథాన్ని లాగనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు కోదండ సత్యనారాయణ తెలిపారు.

టీడీపీ నాయకుల ఇసుక అక్రమ రవాణా



ట్రాక్టరును అడ్డుకున్న గ్రామస్తులు

కంబదూరు: మండలంలోని చెన్నంపల్లి గ్రామ పెన్నానది నుంచి టీడీపీ నాయకులు అక్రమంగా ఇసుక రవాణాను యథేచ్ఛగా సాగిస్తున్నారు. అనుమతులు లేకుండా నిత్యం ఇసుకను ట్రాక్టర్ల ద్వారా కర్ణాటక ప్రాంతానికి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను టీడీపీ నాయకులు తరలిస్తున్నారని పోలీసులు, రెవెన్యూ అధికారులకు గ్రామస్తులు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోలేదు. దీంతో శుక్రవారం గ్రామానికి చెందిన రైతులు ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టీడీపీ నేతలను నిలదీసి ఇసుక ట్రాక్టర్లను అడ్డుకున్నారు. రైతులు మాట్లాడుతూ పెన్నానది నుంచి ఇసుక తరలిస్తే బోరుబావుల్లో భూగర్భజలాలు అడుగంటి పోతాయని వైఎస్సార్‌సీపీ హయాంలోనే పార్టీల కతీతంగా రైతులు ఏకమై ఇసుక రవాణాను నిలుపుదల చేసినట్లు తెలిపారు. కాగా టీడీపీ నాయకులు మాత్రం దౌర్జన్యంగా 'తాము ఇసుకను తోలుతాము.. ఎవరికైనా చెప్పుకోండి..పోలీసులు ట్రాక్టర్లను సీజ్ చేస్తే.. ఎమ్మెల్యే మాకు కొత్త ట్రాక్టర్లను కొనిస్తారని' చెప్తూ ఇసుక రవాణాను కొనసాగించారు.

విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు

కళ్యాణదుర్గం రూరల్: వైద్య సిబ్బంది విధులకు సక్రమంగా హాజరుకావాలని, నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని డీసీఎస్‌హెచ్‌ఎస్ రవికుమార్ హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అనారోగ్య సమస్యలతో ఆసుపత్రికి వచ్చే రోగులకు సక్రమంగా వైద్యం సేవలు అందాలన్నారు. రోడ్డు ప్రమాదాలకు గురైన వారిని చిన్నాపాటి గాయలకు కూడా అనంతపురం రెఫర్ చేయడం సరికాదన్నారు. ఇక్కడే చికిత్స చేయాలని ఆదేశించారు. ఆసుపత్రిలో అన్ని సేవలూ పూర్తిగా ఉచితం అని, ఎవరైనా అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. రాత్రి సమయంలో గ్రామీణ ప్రాంతాల నుంచి అత్యవసర చికిత్స కోసం వచ్చే వారిపై నిర్లక్ష్యం చేయకూడదన్నారు. గర్భిణులు, బాలింతలు వైద్య కోసం ప్రభుత్వాస్పత్రికి రావాలని, ఇక్కడ అన్ని వసతులతో కూడిన వైద్యం అందిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి ప్రసన్న భారతి, డాక్టర్లు, నర్సులు, పాల్గొన్నారు.



ఆస్పత్రిలోని డాక్టర్ల రిజిష్టర్‌ను పరిశీలిస్తున్న డీసీహెచ్‌ఎస్ రవికుమార్

పక్కాగా పంటకోత ప్రయోగాలు

ఆత్మకూరు: పంటకోత ప్రయోగాలు పక్కాగా నిర్వహించాలని తహసీల్దార్ లక్ష్మీనాయక్ వ్యవసాయ సిబ్బందికి సూచించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏఓ సుచరిత, ఏఈఓ మమత, వ్యవసాయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. పంటకోత ప్రయోగాలు నిర్వహించే సమయంలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం రైతులు సాగు చేసిన పంటలో ప్రభుత్వ అధికారుల కొలతల ప్రకారం చుట్టూ తాడు వేసి ఆ తాడు వేసిన భాగం ఎంత మేరకు ఉందో తెలుసుకుని పంట తొలగించాలన్నారు. తూకం వేసేటప్పుడు ఎలాంటి అవకతవకలు లేకుండా తూకాలు వేయాలన్నారు. మండలంలో రెండు చోట్ల పంట కోత ప్రయోగాలు నిర్వహిస్తారని రెండింటో వచ్చిన పంట తూకాలను బట్టి వచ్చిన దిగుబడి తూకాన్ని పక్కాగా ఉన్నత అధికారులకు నివేదికలు పంపాలని ఆదేశించారు. అదే విధంగా ఈ–క్రాప్ బుకింగ్‌లో ఏదైనా సమస్యలు ఉంటే రెవెన్యూ అధికారుల సలహాలు తీసుకోవాలని తెలిపారు.

సచివాలయాల ఆకస్మిక తనిఖీ

బెళుగుప్ప: మండల పరిధిలోని గంగవరం, హనిమరెడ్డిపల్లి గ్రామాల్లోని సచివాలయాలను ఎంపీడీఓ రామచంద్ర శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయా గ్రామ సచివాలయాల్లోని రికార్డులను పరిశీలించారు. సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు.

లీకేజీతో తాగునీరు వృథా

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కణేకల్లు రోడ్డు రైల్వే గేటు పక్కన సీబీఎస్ కాలనీకి వెళ్లే దారిలో గల తుంగభద్ర జలాల తాగునీటి పంపింగ్ పైప్‌లైన్ భారీగా లీకేజీ అవుతోంది. మూడు నెలలుగా లీకేజీతో తాగు నీరు వృథా అవుతున్నట్లు కాలనీవాసులు చెప్తున్నారు. ఫిల్టరేషన్ పాయింట్ నుంచి నీరు జీఎల్ఎస్ఆర్ ట్యాంకులకు పంపింగ్ చేసే పైప్‌లైన్‌కు లోపల భారీ రంధ్రం పడినట్లు తెలుస్తోంది. ఈ విషయమై మున్సిపల్ ఇన్‌చార్జ్ ఏఈ కోదండను అడగ్గా, మొత్తం పంపింగ్ ఆపి మరమ్మతు పనులు చేయాలని, దీన్ని దృష్టిలోఉంచుకుని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామన్నారు.

నల్లబ్యాడ్జీలతో ఆర్టీసీ ఉద్యోగుల నిరసన



నిరసన తెలుపుతున్న ఆర్టీసీ ఉద్యోగులు

రాయదుర్గంటౌన్: ట్రెజరీశాఖ అధికారుల ఉదాసీన వైఖరిని ఖండిస్తూ ఏపీఎస్ ఆర్టీసీ డిపోలో నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో శుక్రవారం నిరసన, గేట్ ధర్నా చేశారు. గ్యారేజ్ కార్యదర్శి సతీష్‌కుమార్ మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగుల పట్ల ట్రెజరీశాఖ ఉన్నతాధికారుల వైఖరితో డ్రైవర్, కండక్టర్లకు ఈ నెల జీతంలో కలపకుండా నిలిపివేసిన నైట్ అవుట్, ఓటీ అలవెన్స్‌లను ప్రభుత్వ జీవో 114 ప్రకారం యధావిధిగా పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు నఫీస్, బాలాజీనాయక్, ప్రకాష్, నాగరాజు, దామోదర్, సిద్ధేశ్వర, రాయుడు తదితరులు పాల్గొన్నారు.

సెమిస్టర్ -2 పుస్తకాలు సరఫరా

శెట్టూరు: మండంలోని వివిధ పాఠశాలకు సెమిస్టర్–2కు సంబంధించిన పుస్తకాలను పాఠశాలలకు సరఫరా శుక్రవారం చేసినట్లు ఎంఈఓ శ్రీధర్ తెలిపారు. 2, 3 తరగతుల విద్యార్థులకు వివిధ పాఠశాలలకు 1,566 పుస్తకాలు వచ్చినట్లు తెలిపారు.

సార్.. సమస్యలు పరిష్కరించండి

రాయదుర్గంటౌన్: బీటీపీ హౌసింగ్ లేఅవుట్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కాలనీ మహిళలు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులుకు శుక్రవారం మొరపెట్టుకున్నారు. వన మహోత్సవంలో భాగంగా లే అవుట్‌కు వచ్చిన ఆయనతో కాలనీ వాసులు సమస్యలపై ఏకరవు పెట్టారు. స్పందించిన ఎమ్మెల్యే కాలనీలో నెలకొన్న సమస్యను రెండు, మూడు రోజుల్లో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ దివాకర్‌రెడ్డిని ఆదేశించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

రాయదుర్గంటౌన్: 74 ఉడేగోళంలోని 132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనుల కారణంగా 31న ఉదయం రెండు గంటల పాటు విద్యుత్ సరఫరా బంద్ చేస్తున్నట్లు ఏఈ బాలు తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు రెండు గంటల పాటు రాయదుర్గం, గుమ్మఘట్ట మండలాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు చెప్పారు.

రేషన్ సక్రమంగా పంపిణీ చేయండి



రేషన్ డీలర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్ బాలకిషన్

కంబదూరు: ప్రతి నెలా నిత్యావసర వస్తువులను కార్డుదారులకు సక్రమంగా పంపిణీ చేయాలని తహసీల్దార్ బాలకిషన్ డీలర్లు సూచించారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రేషన్ డీలర్లు ప్రతి నెలా 1వ తేదీనే ప్రభుత్వం సరఫరా చేసే నిత్యావసర వస్తువులన్నింటినీ కార్డుదారులకు అందజేయాలన్నారు. నిత్యావసర పంపిణీలో ఎలాంటి అవకతవకలు, తూకాల్లో తేడాలు ఉండకూడదన్నారు. డీలర్లు ఎవరైనా అక్రమాలకు పాల్పడుతున్నట్లు కార్డుదారుల నుంచి ఫిర్యాదులు వస్తే తొలగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ గణేష్, ఆర్ఐ కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కూడేరు తహసీల్దార్‌గా మహబూబ్ బాషా



పుష్పగుచ్ఛం అందిస్తున్న సిబ్బంది

కూడేరు: మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా ఉరవకొండ తహసీల్దార్ మహబూబ్ బాషాను నియమించారు. శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు డీటీ విశ్వనాథ్, ఆర్ఐ ప్రసన్న కుమార్, సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలియజేశారు.

ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా భాస్కర్



బెళుగుప్ప: మండల ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా భాస్కర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా బెళుగుప్ప తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న హరినాథ్‌రావు కర్నూలు జిల్లాకు బదిలీ అయ్యారు. కళ్యాణదుర్గం తహసీల్దార్‌గా ఉన్న భాస్కర్‌కు బెళుగుప్పకు ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా నియమించారు. ఆయనకుడీటీ హుస్సేన్ పీరా, ఆర్ఐ నగేష్‌బాబు, ఏఓ పృథ్వీసాగర్ సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా ఫణికుమార్

రాయదుర్గం: కణేకల్లు మండల తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న ఫణికుమార్‌కు రాయదుర్గం ఇన్‌చార్జ్ తహసీల్దార్ (ఎఫ్ఏసీ)గా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. అనంతరం నూతన తహసీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తామన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



ఎస్ఐ నబీరసూల్

బొమ్మనహాళ్: శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని నూతన ఎస్ఐ నబీరసూల్ హెచ్చరించారు. శుక్రవారం బొమ్మనహాళ్‌కు బదిలీపై వచ్చిన ఆయన తన ఉద్యోగ బాధ్యతలను స్వీకరించారు. గుత్తి టౌన్ నుంచి బదిలీపై బొమ్మనహాళ్‌కు వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్ఐ శ్రీనివాసులు కర్నూల్ జిల్లా నందవరం మండలానికి బదిలీ అయ్యారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. శాంతి భద్రతల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదన్నారు. సరిహద్దు గ్రామాల్లో కర్ణాటక మద్యం సరఫరా, అమ్మకాలు జరిపితే తాటతీస్తామన్నారు.

కణేకల్లు ఎస్ఐగా నాగమధు బాధ్యతల స్వీకరణ



కణేకల్లు: కణేకల్లు ఎస్ఐగా వై.నాగమధు శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న శ్రీనివాసులును అనంతపురం వీఆర్‌కు రిజర్వ్ చేయగా, అనంతపురం నాల్గో పట్టణ పోలీసు స్టేషన్‌లో ఎస్ఐగా పని చేస్తున్న వై.నాగమధును కణేకల్లుకు నియమించారు. దీంతో ఆయన బాధ్యతలను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కణేకల్లు ప్రాంతంలో అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా నడుచుకుంటే ఊపేక్షేది లేదన్నారు. ఎస్ఐకు ఏఎస్ఐలు ఈశ్వరయ్య, శంకర్‌రెడ్డి, సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

విధులకు ఈఓపీఆర్‌డీ డుమ్మా

గుమ్మఘట్ట: మండల పరిషత్ కార్యాలయంలో ఈఓపీఆర్డీ సురేశ్‌బాబు తరచూ విధులకు డుమ్మా కొడుతున్నారు. మండలంలో 15 గ్రామ పంచాయతీల బాధ్యతలను చూడాల్సిన ఈఓపీఆర్డీ.. గ్రామాల్లో అపరిశుభ్రత నెలకొని, సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నా పట్టించుకోవడంలేదని ప్రజలు, ప్రజాప్రతినిధులు అంటున్నారు. విధులకు ఎప్పుడు వస్తారో..? ఎప్పుడు వెళతారో అర్థం కావడం లేదని కార్యాలయ సిబ్బంది సైతం పెదవి విరుస్తున్నారు. ఈ విషయంపై ఎంపీడీఓ నరసింహమూర్తిని అడగ్గా..ఆయన ఎప్పుడు వస్తారో, ఎప్పుడు వెళతారో తెలియదని, విచారిస్తామని ఆయన తెలిపారు.